క్లుప్తంగా

అరకిలో వెండి బహూకరణ



జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భద్రాచలం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని శ్రీ సాయి బాబా ఆలయంలో ఏపీలోని ఎటపాక ఎస్సై పార్థసారధి దంపతులు శుక్రవారం బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ సభ్యులకు అరకిలో వెండిని అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించి స్వామివారి ప్రసాదంతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఆలయ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొమ్మనాపల్లి ఆదినారాయణ, కోశాధికారి కుంచాల రమేష్ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం గ్రామంలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్న అరుణాచలంలో నిత్యాన్నదానానికి శుక్రవారం తహసీల్దార్ అశోక్‌కుమార్ రూ.5వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి తహసీల్దార్ దంపతులకు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు గ్రామసభ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కరకట్ట పనులకు సంబంధించి భూసేకరణ నిమిత్తం నేడు స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో పంచాయతీ పరిధిలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని అభ్యంతరాలు తెలియజేయాలని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఐటీసీ ప్రధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–35 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు తమ విద్యార్హత, ఆధార్, కులధ్రువీకరణ జిరాక్స్‌లు, నాలుగు పాస్‌ఫోటోలతో హాజరుకావాలని సూచించారు.

దీక్షాదివస్‌కు తరలిన నాయకులు

చండ్రుగొండ: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన దీక్షాదివస్‌కు మండల బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నాయకులు కొడకండ్ల వెంకటరెడ్డి, దార వెంకటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: దీక్షాదివస్‌కు మండలం నుంచి తరలిన వారిలో మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, కో కన్వీనర్లు బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, నాయకులు వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముత్యంబాబు, ముద్దంగుల కృష్ణ, ఆవుల నర్సింహారావు, అక్కి నర్సింహారావు, ప్రభుదాస్, మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, రామారావు, సురేష్ ఉన్నారు.

'రైతు పండుగ'ను జయప్రదం చేయండి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న రైతుపండుగ ముగింపు కార్యక్రమాన్ని రైతులు జయప్రదం చేయాలని అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఏఓ శివరాం ప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి, అనంతరం రైతుపండుగ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ మానేపల్లి విజయబాబు, రైతులు పాల్గొన్నారు.

నారాయణపురంలో రైతు పండుగ..

మండలంలోని నారాయణపురం గ్రామంలోని సొసైటీ కార్యాలయం వద్ద శుక్రవారం రైతు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు నిర్మల పుల్లారావు మాట్లాడగా నాయకులు ఆకుల శ్రీను, నులకాని శ్రీను, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ములకలపల్లి: రైతుల సంక్షేమమే సహకార సంఘ లక్ష్యమని పీఏసీఎస్ చైర్‌పర్సన్ నడిపల్లి సునంద అన్నారు. స్థానిక పీఏసీఎస్‌లో రైతు పండగ ఘనంగా నిర్వహించారు. మానిటరింగ్ అధికారి వరుణ్‌కుమార్, సంఘ సెక్రటరీ కుంచారపు శ్రీనివాసరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

దమ్మపేట: మండలపరిధిలోని గండుగులపల్లి రైతు వేదికలో నేడు నిర్వహించనున్న రైతు పండుగ సంబురాలను జయప్రదం చేయాలని, మండల వ్యవసాయ అధికారి శీలం చంద్రశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గండుగులపల్లి రైతువేదిక వద్దకు మధ్యాహ్నం 2 గంటలకు రైతులు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కటకటగా.. కిట్..

ఆగిపోయిన హెల్త్‌కిట్ల పంపిణీ

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ కిట్ పేరు మార్పు
- దూరంగా 'అమ్మ ఒడి'
- బాలింతలకు తప్పని ఎదురుచూపులు



కిట్‌తో బాలింత(ఫైల్)

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని గర్భం దాల్చింది మొదలు పురుడు పోసుకునే వరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని అధికారులు, నాయకులు చెబుతునే ఉన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కొన్ని పథకాలకు మంగళం పాడటంతో ఆ ప్రభావం సర్కారు ఆస్పత్రుల్లో ప్రసవాలపై పడినట్లుగా అనిపిస్తుంది.

తల్లీబిడ్డ సంరక్షణ కోసం గత ప్రభుత్వం కేసీఆర్ కిట్, అమ్మఒడి పథకాలు అమలు చేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకునే తల్లులకు రూ.2 వేల విలువ కలిగిన కేసీఆర్ కిట్ అందించారు. ఈ కిట్‌లో 15 రకాల వస్తువులు ఉండేవి. కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేసీఆర్ కిట్ పథకం పేరు మార్చి 'హెల్త్‌కిట్' పేరిట అమలు చేస్తామని ప్రకటించింది. కానీ ఏడాది కావస్తున్నా పథకం అమలుకు నోచుకోక బాలింతలు ఇబ్బందిపడుతున్నారు. పేద కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడిన కేసీఆర్ కిట్ పథకం ఉన్నట్టుండి ఆపేయడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో ఏటా వేల సంఖ్యలో ప్రసవాలు జరుగుతాయి. నాలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు ఎంతో మంది ఇక్కడే ప్రసవం చేయించుకుంటారు. కాగా వీరిలో తెలంగాణ వారికి మాత్రమే ఈ పథకాలు అమలయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాన్పులు చేయించుకున్న వారికి ఈ పథకాలు అమలు చేయడం లేదు.

అటకెక్కిన 'అమ్మ ఒడి'

సర్కారు దవాఖానాల్లో ప్రసవాలు చేయించుకుంటే గత ప్రభుత్వం కిట్‌తోపాటు పేద, మధ్య తరగతి గర్భిణులకు మగబిడ్డ పుడితే రూ.12 వేలు, ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు తల్లుల ఖాతాలో జమ చేసింది. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో పాటు రెండు సార్లు చికిత్స పొందితేనే పథకాలు వర్తించేలా నిబంధనలు పెట్టారు. దీంతో భద్రాచలం ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు పథకాలు ఆగిపోయాయి.



కిట్‌లోని వస్తువులు

స్టాక్ రాగానే పంపిణీ చేస్తాం..



రాష్ట్ర ప్రభుత్వం బాలింతల కోసం హెల్త్ కిట్ పథకం అమలు చేస్తోంది. స్టాక్ ఉన్నంత వరకు బాలింతలకు పంపిణీ చేశాం. జూలై నెల వరకు ఉన్న లబ్ధిదారులకు కిట్‌లను పంపిణీ చేశాం. స్టాక్ లేని కారణంగా ఆగస్టు నుంచి కిట్‌ల పంపిణీ జరగలేదు. డిసెంబర్ మొదటి వారంలో పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు కిట్ పంపిణీ చేస్తాం. ఇందు కోసం అర్హులైన వారి పేర్లను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం.

– డా.రామకృష్ణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు



తాత్కాలిక నిర్మాణాలు తీయిస్తున్న కమిషనర్

మణుగూరు టౌన్: ఫుట్‌పాత్‌లపైకి వచ్చి డబ్బాలు, తోపుడు బండ్లతో వ్యాపారాలు చేస్తూ ప్రయాణికులను, పాదచారులను ఇబ్బందులకు గురి చేస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ యాదగిరి అన్నారు. శుక్రవారం పట్టణంలో కాలినడకన తిరుగుతూ... నాలాలను ఆక్రమించి దుకాణాలను నిర్మించిన, ప్రకటన బోర్డులు పెట్టిన వారిని హెచ్చరించారు. పండ్ల దుకాణాలను తీయించి నాలాకు దూరంగా దుకాణం పరిధిల్లో వ్యాపారం నిర్వహించాలని సూచించారు. ప్రకటన బోర్డులు తొలిగించి తాత్కాలిక నిర్మాణాలు సిబ్బందితో వెంటనే తీయించి మున్సిపాలిటీకి తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు నిర్వహించొద్దని పలుమార్లు సూచించినా తీరు మార్చుకోవడం లేదని ఇలాగే కొనసాగితే తర్వాత జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యాపారులపై నిఘా పెంచాలి

బూర్గంపాడు: రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తు, కాంటాలలో మోసం చేస్తున్న గుర్తింపు లేని ప్రైవేట్ వ్యాపారులపై మార్కెటింగ్‌శాఖ నిఘా పెట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పున్నంచంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కెటింగ్‌శాఖ గ్రామాల్లో నిఘా పెట్టి దళారులు, ప్రైవేటు వ్యాపారుల మోసాలను నియంత్రించాలని కోరారు.

వంశపారంపర్యంగా 'సికిల్‌సెల్'



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పినపాక: సికిల్‌సెల్ అనీమియా వంశపారంపర్యంగా వచ్చే వ్యాధిని ప్రభుత్వ వైద్యాధికారిని దుర్గాభవాని అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని పాతిరెడ్డిపాలెం గ్రామంలో సికిల్‌సెల్ పరీక్షలను నిర్వహించారు. ఈ వ్యాధికి గురైన వాళ్లలో ఎర్ర రక్త కణాలు తగ్గుతూ ఉంటాయని, చిన్న వయసులోనే ఈ వ్యాధి వ్యాపిస్తుందని, కుటుంబ సభ్యులు వ్యాధి గుర్తించకపోవడంతో బాధితులుగా మారుతున్నారన్నారు.

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు



బహుమతులను అందజేస్తున్న కమిటీ సభ్యులు

చర్ల: మండల కేంద్రంలో 'మీ కోసం మేమున్నాం' సహాయక కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు సీఐ రాజువర్మ, ఎంపీడీఓ ఆదయ్య బహుమతులను అందజేశారు. కమిటీ అధ్యక్షుడు నీలి ప్రకాష్, సభ్యులు అరవింద్, గొట్టిపాటి శ్రీనివాస్, దొడ్డా ప్రభుదాసు, కొంగూరు నర్సింహారావు, కొత్తపల్లి ఆంజనేయులు, పున్నం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్‌బాక్స్ వితరణ

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన కోకాకోలా డీలర్ మల్లెల నర్సింహారావు రూ.85 వేల విలువగల ఫ్రీజర్‌బాక్స్(శవపేటిక)ను శుక్రవారం గ్రామానికి వితరణగా అందించారు. వేముల రమణ, నరేష్, వెంకటేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రమణక్క పేట గొత్తికోయ యువకులకు సీఐ కరుణాకర్ శుక్రవారం వాలీబాల్ కిట్ అందించారు. ఎస్సై యయాతి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహంలో వైద్యశిబిరం

మణుగూరు రూరల్: మండలంలోని లంకమల్లారంలో టీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. వీరిలో పలువురికి సికిల్‌సెల్ పరీక్షలు సైతం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, సుమ, ఎంఎల్‌హెచ్‌పీ వినయ్, ఆశవర్కర్లు శైలజ, భవాని పాల్గొన్నారు.

అన్నదాతల్లో తుపాన్ ఆందోళన



నారాయణపురం కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాశులపై కప్పిన పరదాలు

అశ్వారావుపేటరూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రైతుల్లో తుపాన్ ఆందోళన నెలకొంది. ఈ మేరకు శుక్రవారం ఉదయం అశ్వారావుపేట మండలంలో చిరుజల్లులు కురిశాయి. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తరలించగా తేమ శాతం కోసం ఆరబోసిన ధాన్యం రాశులు వర్షం పడితే తడవకుండా ఉండేందుకు పరదాలు కప్పారు. మరో పక్క కోతకు వచ్చిన వరి పంటలను యంత్రాల సాయంతో కోతలు చేస్తుండగా, తుపాన్ నేపథ్యంలో వరి కోతలను తాత్కాలికంగా నిలిపి వేశారు. భారీ వర్షం కురిస్తే నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

దమ్మపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో నిర్వహించిన గణిత పోటీల్లో గెలుపొంది, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గణిత ఫోరం ఆధ్వర్యంలో దమ్మపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంగ్లీషు మీడియంలో ఎస్‌కే.నాసియా ప్రథమ స్థానం, పీ.ధనలక్ష్మి ద్వితీయ స్థానం, తెలుగు మీడియంలో యశ్వంత్ ప్రథమ స్థానంలో గెలుపొంది, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్‌ఎం ఊషారాణి, తదితర ఉపాధ్యాయులు అభినందించి, బహుమతులను అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రమ

భద్రాచలం టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఈ టెస్ట్‌లో తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో రిషి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.మాదవి, కె.రమ్య నిలవగా ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానం వై.హసిని, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎస్.లోహిత ప్రణతి, ప్రణీత్ రెడ్డి సాధించారు. ఎంఈఓ టి.రమ బహుమతులు అందజేశారు. పవన్‌కుమార్, ఏడుకొండలు, పద్మ, సుమలత, దేవి పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం



కళ్యాణం జరిపిస్తున్న పూజారులు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పూజారి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సాగిన కల్యాణాన్ని వందలాది మంది భక్తులు వీక్షించారు.

ట్రస్ట్ బోర్డు మెంబర్ల నియామకం

భద్రాచలం టౌన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ ఇన్ గేట్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థాన ట్రస్ట్ బోర్డు మెంబర్లుగా ఏడుగురి నియమిస్తూ తెలంగాణ దేవాదాయ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవస్థాన బోర్డు మెంబర్లుగా జె.గంగా భవాని, కె.ఈశ్వరహరి, ప్రసాదరాజు, జ్యోతి, వరకుమారి, వి.రమణ, పార్వతి, ఉమాదేవిలతో పాటు అర్చకుడిగా శివకోటి విశ్వనాథం ప్రకటించారు.

విద్యా ప్రణాళికలను అమలుపర్చాలి

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



భద్రాచలం: వర్క్‌బుక్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యా ప్రణాళికలను అమలుపరిచి మెరుగైన ఫలితాలను సాధించాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో ఉన్న గిరిజన సంక్షేమ జీపీఎస్ పాఠశాలలో ఉద్దీపకం వర్క్‌బుక్‌లను ఆయన ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, వారికి ఉత్తమ విద్యను అందించేందుకు అనేక ప్రణాళికలను రూపొందిస్తుందన్నారు. ఐటీడీఏ ద్వారా తయారుచేసిన ఇంగ్లీషు, గణితం ఉద్దీపకములను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఈ వర్క్ బుక్స్‌ను రూపొందించినట్టు తెలిపారు. అనంతరం డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ మాట్లాడుతూ... నిష్ణాతులైన ఉపాధ్యాయులతో వందరోజుల ప్రణాళిక ద్వారా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీడీఓ అశోక్ కుమార్, ఎంఈఓ రమా, ఎస్‌సీఆర్‌పీ శ్రీదేవి, హెచ్‌ఎం భాష్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం : మండలంలోని మునలిమడుగు గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు 'ఉద్దీపకం' వర్క్‌బుక్స్‌ను ఎంఈఓ సున్నం సమ్మయ్య పంపిణీ చేశారు. పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఏజీ.ప్రభాకర్, హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ధర్మరాజు ఉన్నారు.

మూడురోజుల్లో సర్వే పూర్తి చేస్తాం



చంద్రుగొండ : సమావేశంలో ఆర్డీఓ, అధికారులు

చండ్రుగొండ: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే మరో మూడురోజుల్లో పూర్తి చేస్తామని కొత్తగూడెం ఆర్డీఓ డి.మధు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంధ్యరాణి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నలతో ఆయన సమావేశమైయ్యారు. సర్వే జరిగిన తీరు తెన్నులపై సమీక్షించారు. హైకోర్టు ఆదేశాల మేరకు గానుగపాడు గ్రామంలోని నల్లచెరువు రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. భూములు కోల్పోయిన బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు.



మణుగూరు రూరల్ : నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ఆన్‌లైన్ నమోదు పరిశీలన..

మణుగూరు రూరల్ : సర్వేలో సేకరించిన వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు పరిశీలించారు. తప్పులు, పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎన్యుమరేటర్లకు, సిబ్బందికి సూచించారు. ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, సిబ్బంది, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ నిధులతో చెరువు సుందరీకరణ



ప్లాన్‌ను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని ఊర చెరువు సుందరీకరణకు రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ రూ.30 లక్షల నిధులు మంజూరు చేసినట్లు రోటరీ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వివరించారు. శుక్రవారం రోటరీ క్లబ్ ప్రతినిధులు కలెక్టర్‌ను కలసి చెరువు సుందరీకరణలో చేపట్టనున్న పనులను వివరించి తగు సహకారమందించాలని కోరారు. చెరువు మూడు వైపుల కట్టను పటిష్ఠ పరిచి, చెరువు లోతు చేసి ఆయకట్టును పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చెరువు సుందరీకరణకు తమ సహకారం తప్పక ఉంటుందని కలెక్టర్ రోటరీ ప్రతినిధులకు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆదేశానుసారం రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు రోటరీ ప్రతినిధులలతో కలిసి చెరువును పరిశీలించి 13.30 ఎకరాల చెరువు ప్రభుత్వ భూమిలో ఉందని నిర్ధారించారు. గ్రామసభ తీర్మానం తీసుకుని చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించుకోవాలని తహసీల్దార్ ముజాహిద్ రోటరీ ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధి అబ్రహం, రమేష్‌బాబు, ధనశెట్టి రాఘవయ్య, ఎంపీఓ సునీల్, ఇరిగేషన్ ఏఈ చైతన్య, పంచాయతీ కార్యదర్శి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి

మణుగూరు రూరల్: సింగరేణి వ్యాప్తంగా నర్సరీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సెంట్రల్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ఇఫ్టూ అనుబంధ గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.నాసర్‌పాషా సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పీవీ కాలనీ సింగరేణి నర్సరీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీ కార్మికులకు 8.33 శాతం బోనస్ చెల్లించాలని, ప్రత్యేక ప్రోత్సాహక నజరానా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులు ఇందిర, రేణుక, లక్ష్మీ, దేవి, రాజేశ్వరి, వెంకటమ్మ, షాహీన్, కుమారి, సాంబయ్య, కవిత, త్రివేణి, మణెమ్మ, యాదమణి, మల్లమ్మ, రాజకుమారి, శ్రీదేవి, రమణ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అశ్వాపురం: విద్యార్థులకు మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం అందించాలని వంట సామగ్రిని పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచాలని మండల అధికారులు అన్నారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, గొందిగూడెం ఆశ్రమ పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ వీరస్వామి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న వంట సామగ్రి నిల్వ ఉంచే గది, వంట గది, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని అధికారులు పరిశీలించారు. భోజనం నాణ్యతలో లోపాలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

మణుగూరు రూరల్: అసాంఘిక శక్తులకు సహకరించొద్దని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన బడుగుల్లో సీఐ తన సిబ్బందితో కలిసి శుక్రవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం వలస ఆదివాసీ గిరిజనులకు రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా తిరుగుతున్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సభ్యత్వ నమోదు పరిశీలన

దుమ్ముగూడెం: మండలంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు కొడాలి శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొమరం దామోదరరావు, కోనేరు రాము, పాతూరి ప్రసాద్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, దండుగుల రాధాకృష్ణ, వేణు ఉన్నారు.

బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

అశ్వారావుపేటరూరల్: సైబర్‌నేరాలు, చోరీ ఘటనలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అశ్వారావుపేట సీఐ టి.కరుణాకర్ సూచించారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని బ్యాంక్ మేనేజర్లు, ఏటీఎం బాధ్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. భద్రత, ఖాతాదారుల శ్రేయస్సుపై దృష్టి పెట్టాలన్నారు. ఏటీఎం, బ్యాంకుల దగ్గర అనుమానాస్పద వ్యక్తుల సంచరిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సైలు యయాతి రాజు, రామ్మూర్తి, సాయికిశోర్ రెడ్డి, మేనేజర్లు ఉన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గాప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416